క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం

గుత్తి: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం విద్యార్థినులకు సూచించారు. పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్‌తో కలసి ఆమె పాఠశాల పరిసరాలు, వంట గదిని పరిశీలించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులైన డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ సోకే అవకాశముందన్నారు. విద్యార్థినులు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించండి



హైరిస్కు గర్భిణితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి భ్రమరాంబదేవి

యాడికి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి భ్రమరాంబదేవి సూచించారు. ఆదివారం సాయంత్రం ఆమె యాడికి ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. తుపాను కారణంగా మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన దాసరి లావణ్య అనే గర్భిణిని యాడికి పీహెచ్‌సీ వైద్యుడు శ్రీరామ్ కుమార్ ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న గర్భిణితో డీఎంహెచ్ఓ మాట్లాడి.. ఆమెకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందించాల సిబ్బందికి సూచించారు.

నిరసన జయప్రదం చేయండి

గుంతకల్లు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4న చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపు, ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టం, పెట్రోల్, డీజిల్ రేట్ల తగ్గింపు తదితర సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు తదితరులు తెలిపారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



డ్రైనేజీ శుభ్రం చేయిస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నూతన కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మురికి కాలువలు శుభ్రం చేశారు. రోడ్లపై, ఇళ్ల ముందు నిలుచున్న మురుగు, చెత్తాచెదారం తొలగించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పుట్లూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఆదివారం చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపీడీఓ యోగానందరెడ్డి పరిశీలించారు. వర్షాలకు గ్రామాల్లో అపరిశుభ్రత ఏర్పడి దోమలు ఎక్కువయ్యే అవకాశం ఉండటంతో.. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన వివరించారు. కాలువల పూడిక తీత పనులను చేపట్టడంతో పాటు అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామలింగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: మండలంలోని రామ్‌దాస్‌పేట 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా కల్లూరు నుంచి అనంతపురం వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు జాతీయ రహదారిపై పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

అంతటా అప్రమత్తం

- తుపాను నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారుల సూచన

గుంతకల్లుటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తుపాన్ నేపథ్యంలో ప్రజలకు ఏదైనా సహాయం, సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన వారు 08552-226726 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పామిడి: కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు కురుస్తున్న వర్షాల వల్ల ప్రమాద నివారణకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. బంగాళఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంలో వల్ల ఈ నెల 2వ తేదీ వరకూ అధిక వర్షాలు పడే ఆస్కారం ఉన్నందున పంట, ఇళ్లు, ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్‌లో సంబంధింత వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్ఏలు అందుబాటులో ఉంటారన్నారు. అవసరమైన వారు 9963629648 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గార్లదిన్నె: కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రామనాగేశ్వరి, వీఆర్వో త్రివేణి, సర్వేయర్లు శ్రీనివాసులు, గణేష్ కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంటారన్నారు. వర్షాలు వల్ల ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 8639310013, 9160788302, 9703046747, 8142241002 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

జాజికొండ వాగు పరిశీలన

పుట్లూరు: మండలంలోని కడవకల్లు నుంచి పుట్లూరు చెరువుకు వచ్చే జాజికొండ వాగును ఆదివారం తహసీల్దార్ శేషారెడ్డి పరిశీలించారు. వర్షాలకు నీటి ఉధృతి ఉండే ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పుట్లూరు చెరువులో నీటి నిల్వను హెచ్చెల్సీ జేఈ ఫణీంద్రతో కలిసి అంచనా వేశారు. ఇప్పటికి 50 శాతం మేరకు చెరువులో నీటి నిల్వ ఉందన్నారు. చెరువు కట్టల భద్రతపై ఆయన ఆరా తీశారు. వర్షాలు కురిసి వంకలు, వాగులు వచ్చే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వల్ల పామిడిలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి నిరవధికంగా వర్షం పడడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ వర్షానికి రోడ్ల గుంతలు వర్షపునీటిమయమయ్యాయి. దీంతో పాదచారులు, వాహనచోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షాల వల్ల వరి మినహా మిగతా పంటలు కోల్పోవాల్సి వస్తుండడడంతో తీవ్ర నష్టం వాటిల్లే ఆస్కారం ఉందంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పామిడిలో వర్షం కురుస్తున్న దృశ్యం



పుట్లూరు సమీపంలో జాజికొండ వాగును పరిశీలిస్తున్న అధికారులు

ఉద్యాన పంటల పరిశీలన



పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి

యాడికి: పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట గ్రామంలో చామంతి పూలతోట, టమాట, అరటి పంటలను తాడిపత్రి ఉద్యాన శాఖ అధికారిణి ఉమాదేవి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న పూలను కోసిన తర్వాత మార్కెట్‌కు పంపే లోపు వాటిని తాత్కాలికంగా బాగా గాలి వెలుతురు వచ్చే ప్రదేశంలో నిల్వ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్, ఒక మిల్లీ లీటరు, లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 1-2సార్లు పిచికారీ చేయాలన్నారు. భారీ వర్షాలు వచ్చే సూచనలు ఉన్నందున అరటి రైతులు తోటల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. అరటి గెలలను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి పక్షం రోజుల్లో మార్కెట్ చేసుకోవాలన్నారు. వర్షా కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోకుంటే సిగటోక ఆకుమచ్చ తెగులు వచ్చే ఆస్కారముందని ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి



శింగనమల: మండల కేంద్రంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ ఆదివారం తెలిపారు. శింగనమలలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం సీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తామన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ అభిమానులు హాజరు కావాలని కోరారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైస్సాఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గార్లదిన్నెలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలన్నారు.

యూపీఎస్‌కు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన యూపీఎస్ పింఛన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ గుత్తి జోన్ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆందోళన చేశారు. రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు ఆదినారాయణరెడ్డి, మాబుల్లా, లక్ష్మణ్ మాట్లాడుతూ ఓపీఎస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరుద్ధరించాలన్నారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఓపీఎస్ పునరుద్ధరించని పక్షంలో భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ సందీప్‌కు ఏపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామచంద్రుడు, బాలరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు డెలియల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీకేఎస్ మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఆదివారం 11వ రోజు తాగునీటి పథకం కార్మికులు మోకాళ్లపై నిలబడి ఆందోళన నిర్వహించారు. కార్మికసంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, లక్ష్మన్న, నాగరాజు పెద్దన్న, నల్లప్ప, విశ్వరూప, నరేష్, విశ్వనాథ్, వలి తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని కల్లూరులో వేతనాల కోసం సత్యసాయి కార్మికులు అర్ధ నగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలిపారు.

స్టార్టర్, కేబుల్ చోరీ

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో ఓ రైతుకు చెందిన విద్యుత్ స్టార్టర్ పెట్టె, కేబుల్ చోరీ సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం బాధిత రైతు రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... గ్రామంలో ఆరు ఎకరాల్లో అతడు చీనీ చెట్లు సాగు చేశాడు. పాత బోరులో నీరు పూర్తిగా అడుగంటడంతో ఇటీవల కొత్తగా బోరు వేసి కొత్త స్టాటర్ ఏర్పాటు చేసి, కేబుల్ బిగించాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు స్టార్టర్ పెట్టె, 40 మీటర్లు కేబుల్ దొంగలించారు. రెండు నెలలు క్రితం కూడా స్టార్టర్ పెట్టె, 25 మీటర్ల కేబుల్ చోరీ చేశారన్నారు. పోలీసులు దొంగలను గుర్తించి న్యాయం చేయాలని రైతు కోరాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జూదరుల అరెస్ట్

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చేనేత కాలనీలో పేకాట కేంద్రంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ చిన్న రెడ్డప్ప ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.6,180 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యాత్మక గ్రామాల్లో సీఐ పర్యటన

తాడిపత్రి రూరల్: మండలంలోని సమస్యత్మాక గ్రామాల్లో ఆదివారం అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి పర్యటించారు. మండలంలోని యుగుడూరు, పులిప్రొద్దుటూరు, గంగాదేవిపల్లి, చుక్కలూరు గ్రామాల్లో పర్యటించి బందోబస్తు పోలీసులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వినాయక విగ్రహాల ఏర్పాటును అన్‌లైన్‌లో నమోదు చేసుకోండి .

వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ చేసుకోవడం వల్ల పోలీసు, రెవెన్యూ, ఫైర్ శాఖ అధికారులు వచ్చి తగు జాగ్రత్తలు, సూచనలు తెలియజేస్తారన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

స్థానిక అప్‌గ్రేడ్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శివ గంగాధర్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హింసాత్మక సంఘటనలకు దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలన్నారు.

దోమతెరల వితరణ

తాడిపత్రి అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలికల వసతి గృహానికి రూ.6 వేలు విలువ చేసే దోమతెరలను వితరణ చేశారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని బాలికల వసతి గృహంలో 80 మంది విద్యార్థినులకు 20 దోమతెరలను హాస్టల్ వార్డెన్ సువర్ణకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప, మహిళా అధ్యక్షురలు విజయలక్ష్మి, గౌరవాధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి రామాంజినేయులు, కన్వీనర్ శంకర్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి



హంద్రీనీవా కాలువ వద్ద నిరసన చేపడుతున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు



క్రిష్టిపాడులో రైతు దినోత్సవం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



పుట్లూరులో జెండా ఎగురవేస్తున్న రైతు సంఘం నాయకులు

గుంతకల్లు రూరల్: రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా అన్నదాతల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జి.కొట్టాల హంద్రీనీవా కాలువ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. అధికారంలోకి రాకముందు రైతులను వరాలను గుప్పించిన ప్రభుత్వాలు ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నాయన్నారు. 1500 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న హంద్రీనీవా కాలువను 4 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.

పెద్దవడుగూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని విస్మరించాయని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్, నాయకులు ఓబిరెడ్డి, ఆదినారాయణ, రఫి, శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రైతు దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధరలేక అప్పుల కూబిలో కూరుకపోతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. రైతు రుణ విమోచన చట్టం తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, రంగారెడ్డి, అల్లాబకాస్, ముత్యాలు, నారాయణ, మల్లిఖార్జున, హుసేన్‌పీరా, ఆదినారాయణ, బాలగంగన్న తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: రైతుల హక్కుల కోసం ఏపీ రైతు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఫార్మర్స్ డిమాండ్స్ డే సందర్భంగా రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి

శింగనమల: మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని శింగనమలకు చెందిన డాక్టర్ కొప్పెర్ల మానసరెడ్డి సూచించారు. ఆదివారం శింగనమలలో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. గురువైన యేసుక్రీస్తు బోధనలు మనకు ఆత్మ జ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ఫలప్రదమవుతాయన్నారు.

ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాలు మేరకు.. పెద్దవడుగూరు మండలం నీలూరు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నారాయణస్వామి కారులో అనంతపురం నుంచి పామిడి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో హరినాథ్ అనే వ్యక్తి కారులో వెళ్తూ కల్లూరులో స్పీడ్ బ్రేకర్ వద్దకు వెళ్లగానే షడన్ బ్రేక్ వేశాడు. వెనుక నుంచి ముందర వెళ్తున్న కారును ఢీకొనడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రున్ని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో ఇరు వర్గాలు ఘర్షణలో ఆరు గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో వ్యక్తిగత విషయమై శనివారం ఇరు వర్గాలు ఘర్షణ పడి పరస్పరం దాడులు చేసుకున్నారన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఒక వర్గం తాతయ్య, ధనుష్, లక్ష్మీదేవి, మరోవర్గం ఓబిలేసు, రామ్మోహన్, ఆదినారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పామిడిలోని టీసీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సందడి నెలకొంది. 1980-81లో పదో తరగతి చదివిన విద్యార్థులు 44 ఏళ్ల తర్వాత అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో మొదలైన ఈ కార్యక్రమంలో ఎంతో కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పి ప్రయోజకులను చేసి మృతిచెందిన 15 మంది ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటించారు. క్లాస్ రూమ్‌ల్లో ఆనాటి చిలిపిచేష్టలను గుర్తు చేసుకున్నారు. ఒకరి బాగోగులును ఒకరు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులకు సంబంధించి బి.అనిత ప్రస్తుతం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ కాగా, సాయి మనోహర్ మధ్యప్రదేశ్ డీజీపీగా కొనసాగుతున్నారు. అలాగే చాలా మంది డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, పోలీసాఫీసర్లు, ఉపాధ్యాయ, జర్నలిజం, బిజినెస్ తదితర రంగాల్లో రాణిస్తుండడం విశేషం. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్సు గౌరి, సీనియర్ అడ్వకేట్ రాజశేఖర్‌గౌడ్, చాంద్‌బాషా, ఏఎస్ఐ పద్మావతి, గుజ్జార శ్రీనివాసరావు, వీరేష్, పీడీ శంకర్, పీఎస్ రవిరాజు, మంజు, రమేష్, వలి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా..ప్రయాణమెలా?

- అధ్వానంగా గుంతకల్లు రహదారి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



అధ్వానంగా ఉన్న గుంతకల్లు రోడ్డు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డు చాలా అధ్వానంగా మారింది. రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు కూడా అవస్థలు పడుతున్నారు. ఇక వర్షం వచ్చిందంటే వాహనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా వీలుకానంత అధ్వానంగా రహదారులు మారాయి. ఎమ్మెల్యే , ఉన్నతాధికారులు తరుచూ ఆ రోడ్డు మీదుగా వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డుపై గుంతల వల్ల తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



రహదారి దుస్థితి ఇలా..



ఇబ్బంది పడుతున్న బస్సు డ్రైవర్